సాక్షి
కాకినాడ
మంగళవారం । 10 । జనవరి । 2023



మకర తోరణం సమర్పణ

కొత్తపేట: కమ్మిరెడ్డిపాలెం గ్రామ దేవత తాళ్లమ్మ అమ్మవారికి పరమటి సుబ్బారావు, సుజాత దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ. 80 వేలతో ఇత్తడి మకర తోరణాన్ని సమర్పించారు.



కోనసీమ కుర్రోడి పంచ్‌కొట్టుడు

కోనసీమ జిల్లా ప్రాంతంలో ఓ కుగ్రామం కుందాలపల్లికి చెందిన పృథ్వీరాజు కుర్రోడు బాక్సింగ్‌లో రాణిస్తున్నాడు. - వివరాలు 8లో▸

క్రీడలతో ఉజ్వల భవిత



చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. - 8లో▸

అక్రమాలకు చెక్

- ఉపాధి కూలీల హాజరు ఇక ఆన్‌లైన్
- హాజరుపై సోషల్ ఆడిట్‌లో ఆరోపణలు
- ఈ నేపథ్యంలోనే మార్పు
- కూలీల సంఖ్య నేరుగా ప్రభుత్వాలకు తెలిసే అవకాశం

జిల్లాలో ఉపాధి హామీ పథకం	
జాబ్‌కార్డులు	: 4,07,078
ఉపాధి కల్పించిన కుటుంబాలు	: 1,47,150
కూలీల సంఖ్య	: 2,12,847
వంద రోజుల పని పొందిన కుటుంబాలు	: 353

కాకినాడ సిటీ: ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరు విషయంలో అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ హాజరు విధానం తీసుకొచ్చింది. అలాగే ఇక నుంచి ప్రతి పని వివరాన్నీ నేషనల్ మస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్) ద్వారా పంపాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్‌ఐసీ) రూపొందించింది. ఉపాధి హామీ పథకం ప్రారంభమైనప్పటి నుంచీ కూలీల హాజరు విషయంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రారంభంలో మాన్యువల్ మస్టర్ ద్వారా హాజరు వేసేవారు. 2021 నుంచి గత నెలాఖరు వరకూ ఎంఎంఎస్ ద్వారా హాజరు నమోదు చేసేవారు. ఈ నెల 1 నుంచి కూలీల హాజరును ఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లోనే నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. దీనిని జిల్లాలో పక్కాగా అమలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. దీంతో కూలీల హాజరు విషయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నేరుగా తెలిసే అవకాశం ఏర్పడుతోంది.

ఒక్కరున్నా ఆన్‌లైన్ హాజరే

ఎన్‌ఎంఎంఎస్ ద్వారా గతంలో 20 మంది కంటే ఎక్కువ మంది కూలీలు హాజరైతేనే ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. అంతకంటే తక్కువగా ఉంటే ఈ–ఎంఎంఎస్ ద్వారా హాజరు ఉండేది. ప్రస్తుతం సంఖ్యతో పని లేకుండా ఒక్క కూలీ ఉన్నప్పటికీ ఎంఎంఎస్ విధానం ద్వారా ఆన్‌లైన్‌లోనే హాజరు నమోదు చేయాలి. ఒకవేళ ఆన్‌లైన్‌లో అటెండెన్స్ అప్‌లోడ్ చేయకపోతే కూలీలకు ఎటువంటి పేమెంట్ జరగదు. అలాగే పని ప్రదేశంలో రెండుసార్లు ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

అక్రమాలకు అడ్డుకట్ట

ఉపాధి పథకం ప్రారంభంలో కూలీల మస్టర్ల విషయంలో ఎన్నో ఆరోపణలు వచ్చాయి. సోషల్ ఆడిట్ జరిగినప్పుడు ప్రతిచోటా కూలీల హాజరు విషయంలోనే సమస్య ఎదురయ్యేది. కొన్నిచోట్ల



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (పాతచిత్రం)

ఘర్షణ వాతావరణం చోటు చేసుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లు తమ కుటుంబ సభ్యులు, వారికి అనుకూలమైన వారు పనులకు రానప్పటికీ మస్టర్లు నింపి హాజరైనట్లు చూపించి, అక్రమాలకు పాల్పడిన పరిస్థితులు అప్పట్లో కోకొల్లలుగా వెలుగు చూశాయి. ఈ–ఎంఎంఎస్ విధానం అమలులోకి రావడంతో ఇటువంటి అక్రమాలకు చెక్ పడనుంది. అయితే ఆన్‌లైన్ హాజరు విధానం నుంచి వ్యక్తిగత పనులకు మినహాయింపు ఇచ్చారు. అంటే ప్లాంటేషన్, కందకాలు, రీ ప్లాంటేషన్, హార్టికల్చర్, హౌసింగ్ పనులు వంటి వాటికి ఈ మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ హాజరు ఎంతో మేలు



ఉపాధి హామీ పథకంలో ప్రస్తుతం అమలవుతున్న ఆన్‌లైన్ హాజరు విధానం అందరికీ ఉపయోగకరమే. మనం చేస్తున్న పనులు, హాజరవుతున్న కూలీల సంఖ్య నేరుగా ప్రభుత్వాలకు కూడా తెలుస్తుంది. అంతేకాకుండా ఎక్కడా అక్రమాలు జరిగే వీలుండదు. పనులకు వచ్చిన వారికి న్యాయం జరుగుతుంది.

- అడపా వెంకటలక్ష్మి, డ్వామా పీడీ, కాకినాడ జిల్లా

అభయారణ్యంలో నేడు పక్షుల గణన

పక్షుల లెక్కింపుపై ఔత్సాహికులకు శిక్షణ



కోరంగిలో పర్యావరణ ఔత్సాహికులు, అటవీ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

తాళ్లరేవు: నీటి పక్షుల పరిరక్షణ, వలస పక్షుల సంరక్షణ కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ఆసియన్ వాటర్ బర్డ్ సెన్సస్ కార్యక్రమం మంగళవారం కోరింగ అభయారణ్యంలో జరగనుంది. ఈ మేరకు సోమవారం కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్‌లోని బయోడైవర్సిటీ సెంటర్‌లో బీఎన్‌హెచ్‌ఎస్ (బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ) ఆధ్వర్యంలో పర్యావరణ ఔత్సాహికులు, అటవీ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఐబీసీఎన్ స్టేట్ కోఆర్డినేటర్ మృత్యుంజయరావు, బీఎన్‌హెచ్‌ఎస్ డిప్యూటీ డైరెక్టర్ సత్యసెల్వం, ఫారెస్ట్ రేంజర్ ఎస్‌ఎస్‌వీ వరప్రసాదరావు హాజరై నీటి పక్షుల గణనకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. అదేవిధంగా పక్షులను ఎలా పరిరక్షించాలి, వలస పక్షులను ఏవిధంగా సంరక్షించాలన్న అంశాలపై డీడీ సత్యసెల్వం అవగాహన కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా 1967లో నీటి పక్షుల గణన ప్రారంభం కాగా, ఆసియా రీజియన్‌లో మాత్రం 1987 నుంచి 27 దేశాలలో జరుగుతుందని సత్యసెల్వం తెలిపారు. ఇండియాలో నాలుగు వేలకు పైగా చిత్తడి నేలలు ఉన్నాయని, వాటిలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అదేవిధంగా పక్షుల్లో రకాలు, వాటిని ఎలా గుర్తించి, గణన చేపట్టాలనే అంశంపై బయాలజిస్ట్ మహేష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నీటిలో, చెట్ల నడుమ సంచరించే పక్షులకు సంబంధించి ఫొటోగ్రఫీ ద్వారా ఏ విధంగా లెక్కించాలనే అనే టెక్నిక్‌లను తెలియజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విపత్తుల నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు

కాకినాడ సిటీ: జిల్లాలో విపత్తుల నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు రూపొందించి, అమలు చేయనున్నామని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. విపత్తుల నిర్వహణపై ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలెక్టరేట్ వివేకానంద హాలులో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. జిల్లాలో భౌగోళిక పరిస్థితులు, సంభవిస్తున్న విపత్తులు ముఖ్యంగా భారీ వర్షాలు, వరదల ప్రభావంపై చర్చించారు. వరదల వల్ల కాలువలు పొంగి పంట నష్టం వాటిల్లుతున్న ప్రాంతాల పరిస్థితిపై సమీక్షించారు. భవిష్యత్తులో భారీ వర్షాలు, వరదల వల్ల నష్టం సంభవించకుండా ఉండేందుకు చేపట్టాల్సిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలువల వ్యవస్థను పటిష్టం చేయడం, స్లూయిజ్‌ల పునర్నిర్మాణం, గండ్ల పూడ్చివేత, రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు, అక్విడెక్టు తదితరాలపై చర్చించి, వివిధ పనుల ప్రతిపాదనలను పరిశీలించారు. వంతెనల ఏర్పాటు, అత్యవసర మరమ్మతులు, రోడ్ల ఏర్పాటు తదితర పనులకు ప్రతిపాదనలు స్వీకరించారు. అవసరాలకు అనుగుణంగా పనుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ బి.హరిప్రసాద్, ఇరిగేషన్ ఈఈ రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా ప్రత్యేక అవసరాల పిల్లల నమోదు

కాకినాడ: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల నమోదును వేగవంతం చేయాలని సమగ్రశిక్షా ఐఈ కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఈ నెల పదో తేదీ లోగా ఐఈడీపీహెచ్‌జీ:జీమెయిల్.కామ్‌కు ఆయా విద్యార్థుల వివరాలు మెయిల్ చేయాలన్నారు. దీంతోపాటు ఎంఈఓల సంతకాలతో కూడిన హార్డ్‌కాపీలను సమగ్రశిక్ష కార్యాలయానికి నేరుగా అందివ్వాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, ర్యాంప్ విత్ రైలింగ్, డిజేబుల్ ఫ్రెండ్లీ టాయిలెట్లు తదితర వివరాలను పాఠశాల రిపోర్ట్ కార్డులలో సైతం అప్‌లోడ్ చేయాలన్నారు. యూడైస్ ప్లస్‌లో వివరాల ఆధారంగా 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆయా చిన్నారులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందుతాయని తెలిపారు.


బాలిక మృతిపై కేసు

తొండంగి: మండలంలోని బీచ్‌రోడ్డులో అవల్దార్‌పాడు వద్ద బైకు ఢీకొట్టి, తీవ్రంగా గాయపడిన బాలిక చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. తొండంగి ఎస్సై ఎస్.రవి కుమార్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. అవల్దార్‌పాడుకు చెందిన పిర్ల వీరదుర్గ (6) గత డిసెంబర్ 12వ తేదీ సాయంత్రం రోడ్డు పక్కన నిల్చుని ఉండగా బైకు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వీరదుర్గ ఆదివారం మృతి చెందింది. బాలిక తండ్రి రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

టెన్నిస్‌లో జిల్లా పోలీసు అధికారుల ప్రతిభ

కాకినాడ క్రైం: గుంటూరు ఆఫీసర్స్ క్లబ్‌లో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకూ జరిగిన సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో 55 ఏళ్లు పైబడిన విభాగంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పోలీసు అధికారులు సత్తా చాటారు. కాకినాడ జిల్లా అదనపు ఎస్పీ బి.సత్యనారాయణ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏఆర్ డీఎస్పీ విజయసారథి రాణించి కప్పు గెలుచుకున్నారు. వారిని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు సోమవారం అభినందించారు.

పోలీసు స్పందనకు 59 ఫిర్యాదులు



ఫిర్యాదీల సమస్య వింటున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం పోలీసు స్పందన నిర్వహించారు. ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో 59 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో సివిల్ విభాగానికి చెందినవి 17, కుటుంబ తగాదాలకు సంబంధించినవి 9, మిగిలిన 33 వివిధ అంశాలకు సంబంధించినవి ఉన్నాయని అధికారులు తెలిపారు.

గడువులోగా స్పందన అర్జీల పరిష్కారం

కాకినాడ సిటీ: స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఆర్‌ఓ కె.శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సంక్షేమ పథకాలు, పౌర సరఫరా సేవలు, నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై 312 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

మాట్లాడుతూ, స్పందన అర్జీల పరిష్కారానికి సంబంధించిన ఫొటోలను తప్పనిసరిగా జత చేయాలని అధికారులను ఆదేశించారు.

అన్నవరం దేవస్థానానికి రెండు బ్యాటరీ కార్లు

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అన్నవరం శాఖ రెండు బ్యాటరీ కార్లు బహూకరిస్తోంది. ఈ విషయాన్ని ఎస్‌బీఐ అన్నవరం బ్రాంచి మేనేజర్ టి.బాలసుబ్రహ్మణ్యశర్మ సోమవారం తెలిపారు. వీటి విలువ సుమారు రూ.26 లక్షలని పేర్కొన్నారు. స్వామివారి సన్నిధికి వచ్చే వృద్ధులు, వికలాంగులు, మహిళలను సత్రాల నుంచి స్వామివారి ఆలయానికి, తిరిగి సత్రాలకు చేర్చేందుకు ఈ వాహనాలను సమకూరుస్తున్నామన్నారు. వీటిని దేవస్థానం అధికారులకు మంగళవారం అందజేస్తామని చెప్పారు. ఒక్కో కారులో 14 మంది ప్రయాణించే వీలుంటుందన్నారు. కాగా స్టేట్‌బ్యాంక్ గతంలో కూడా



స్టేట్‌బ్యాంక్ అందజేయనున్న బ్యాటరీ కారు

ఏడుగురు భక్తులు ప్రయాణించేందుకు వీలుగా ఒక బ్యాటరీ కారును దేవస్థానానికి అందజేసింది.

చరిత్ర సృష్టించిన పాదయాత్ర

- సీఎం జగన్ ప్రజాసంకల్ప యాత్రకు నాలుగేళ్లు
- జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు
- జెడ్పీలో ఘనంగా వేడుకలు

కాకినాడ సిటీ: ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపడుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైపే ప్రజలు ఉన్నారని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు విపక్ష నేతగా నిర్వహించిన ప్రజాసంకల్ప పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం సాయంత్రం జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులతో కలిసి చైర్మన్ విప్పర్తి కేక్ కట్ చేసి, అధికారులకు, జెడ్పీ సభ్యులకు పంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం సీఎం జగన్ నెరవేర్చారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. పాదయాత్రలో ఇచ్చినవే కాకుండా ఇవ్వని హామీలు సైతం నెరవేరుస్తున్న ఆయన పాలన రామరాజ్యాన్ని తలపిస్తోందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. అధికారం కోసం మొసలి కన్నీరు కారుస్తున్న చంద్రబాబు.. సినిమా



కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీటీసీ సభ్యులు

డైలాగులతో మాటల గారడీ చేస్తున్న పవన్ కల్యాణ్‌లకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని విప్పర్తి అన్నారు. మహిళలకు ఆసరా పథకం, సున్నావడ్డీ, నాలుగేళ్లలో రూ.75 వేల ఆర్థిక సాయం.. రైతులకు రైతు భరోసాతో పాటు వ్యవసాయానికి కావల్సిన అన్ని రకాల విత్తన, ఎరువులు, యంత్ర పరికరాలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు విద్యార్థులకు యూనిఫారం, పుస్తకాలు, విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి వంటి కార్యక్రమాలు, పేదలకు నవరత్నాలు పేరుతో శాశ్వత గృహాలు, ఆటో డ్రైవర్లకు వైఎస్సార్ వాహనమిత్ర, కాపుల మహిళలకు కాపు నేస్తం పేరుతో రూ.15 వేల ఆర్థిక సాయం, డ్వాక్రా మహిళల వ్యాపారాభివృద్ధికి స్త్రీనిధి, చేయూత వంటి పథకాల ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నారని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వివరించారు. తొలుత రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు జక్కంపూడి కిరణ్, పెదపూడి జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, రామచంద్రపురం, బిక్కవోలు జెడ్పీటీసీ సభ్యులు మెర్నీడి వెంకటరమణ, రొంగల పద్మావతితో కలిసి ప్రత్యేకంగా తయారు చేయించిన ప్రజాసంకల్ప పాదయాత్ర కేక్‌ను కట్ చేసి అందరికీ పంచారు.

దిగివచ్చిన ప్రభుత్వం.. చర్చలు సఫలం

యానాం ఎమ్మెల్యే అశోక్ దీక్ష విరమణ

యానాం: నియోజకవర్గంలో ప్రజల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ నాలుగు రోజులుగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేపట్టిన నిరాహార దీక్షకు పుదుచ్చేరి ప్రభుత్వం దిగివచ్చింది. దీక్షలో ఉన్న అశోక్‌తో చర్చించేందుకు దీక్షా శిబిరానికి పుదుచ్చేరి ప్రభుత్వం తరఫున హోం మంత్రి నమశ్శివాయం, ముగ్గురు ఎమ్మెల్యేలు సోమవారం రాత్రి యానాం వచ్చారు. రాత్రి 12 గంటల వరకూ ఆయనతో చర్చించారు. సుమారు గంటన్నర పాటు చర్చలు జరిపారు. సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వడంతో దీక్ష విరమించేందుకు ఎమ్మెల్యే ఒప్పుకొన్నారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి వరకూ ఆయన ఆమరణ నిరాహార దీక్ష కొనసాగించారు. యానాం, పరిసర ప్రాంతాలు, కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లాల నుంచి పార్టీలకతీతంగా అధిక సంఖ్యలో నాయకులు తరలివచ్చి ఎమ్మెల్యే అశోక్‌కు సంఘీభావం ప్రకటించారు. యానాం పరిపాలనాధికారి మునిస్వామి దీక్షా శిబిరాన్ని సందర్శించి అశోక్‌తో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు దీక్షా కూడా శిబిరాన్ని సందర్శించారు.



ఎమ్మెల్యే అశోక్‌తో చర్చిస్తున్న పుదుచ్చేరి హోం మంత్రి నమశ్శివాయం, ఎమ్మెల్యేలు ఫోన్‌లో మాట్లాడిన పుదుచ్చేరి ఎల్జీ తమిళిసై

ఎమ్మెల్యే అశోక్‌తో పుదుచ్చేరి ఇన్‌చార్జి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మధ్యాహ్నం ఫోన్‌లో మాట్లాడారు. డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకువెళతామని, ఆరోగ్య పరిస్థితి రీత్యా దీక్ష విరమించాలని కోరారు. కచ్చితమైన హామీ ఇస్తేనే దీక్ష విరమిస్తానని ఎమ్మెల్యే ఆమెకు చెప్పారు. చివరకు ప్రభుత్వం తరఫున హోం మంత్రి, ఎమ్మెల్యేలు రాత్రి వచ్చి అశోక్‌తో దీక్ష విరమింపజేశారు. మొత్తం 15 డిమాండ్లనూ దశల వారీగా పరిష్కరిస్తామని, వీటిలో ఏడింటిని వెంటనే పరిష్కరించేందుకు అంగీకరించారు. కార్యక్రమంలో నాయకులు మెట్ల రమణబాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి బాబీ, వంగవీటి రంగా – రాధా మిత్రమండలి అధ్యక్షుడు కాళ్లపాలెం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులకు సన్మానం

కాకినాడ క్రైం: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఐదుగురు పీహెచ్‌సీ వైద్యాధికారులను ఉత్తమ సేవల విభాగంలో ప్రభుత్వం ఎంపిక చేసింది. వారిని తన కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతిప్రభ సోమవారం సత్కరించారు. సత్కారం పొందిన వారిలో జ్యోతిమణిమాల (గండేపల్లి), జి.అనురాధ (మల్లాం), కేవీ నరేష్ (తాళ్లూరు–1), ప్రశాంతి (తూరంగి), ఎస్.రాజశేఖర్ (కాట్రావులపల్లి) ఉన్నారు.

మరింత సులువుగా..

- ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్‌తో వివాహ రిజిస్ట్రేషన్
- 2న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- ఇప్పటికే ఆన్‌లైన్‌లో 20 రిజిస్ట్రేషన్లు


కాకినాడ లీగల్: పారదర్శక పాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా మ్యారేజ్ రిజిస్ట్రేషన్లకు కూడా ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ మేరకు ఈ నెల 2న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానం ద్వారా ఆన్‌లైన్‌లో సమాచారం పొందుపరడం వల్ల బర్త్, డెత్ సర్టిఫికెట్ల మాదిరిగా ఎప్పుడు కావాలంటే అప్పుడు వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తీసుకునే వెసులుబాటు ప్రజలకు కలగనుంది. హిందూ వివాహ సర్టిఫికెట్, ప్రత్యేక వివాహ సర్టిఫికెట్ గతంలో మాన్యువల్ పద్ధతిలోనే ఇచ్చేవారు. దీనికి ఎక్కువ సమయం పట్టేది. ఆన్‌లైన్ వివాహ రిజిస్ట్రేషన్ వలన ఆ ఇబ్బందులు తప్పనున్నాయి.

ఇదీ నూతన విధానం

www. registration.ap.gov.in (ఐజీఆర్‌ఎస్) వెబ్‌సైట్‌లోకి వెళ్లి హిందూ మ్యారేజ్ రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంచుకోవాలి. అక్కడ న్యూ రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేసి మొబైల్ నంబర్ లేదా ఈ–మెయిల్ అడ్రస్ ఇవ్వాలి. దానికి వచ్చిన ఓటీపీ ఎంటర్ చేసిన తరువాత పాస్‌వర్డ్ ఇచ్చుకుని లాగిన్ అవ్వాలి. అనంతరం వధూవరుల టెన్త్ లేదా బర్త్ సర్టిఫికెట్ లేదా పాస్‌పోర్టు, దంపతులిద్దరి ఆధార్ కార్డులు, వివాహ పత్రిక, వివాహ ఫొటో, కల్యాణ మండపం రశీదు, ముగ్గురు సాక్షుల ఆధార్ కార్డులను అప్‌లోడ్ చేయాలి. దీని ఆధారంగా వారు ఏ రోజు, ఏ సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలో అపాయింట్‌మెంట్ స్లాట్ వస్తుంది. ఆ సమయానికి దంపతులు, ముగ్గురు సాక్షులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి సంతకాలు పెట్టాలి. ఆ సర్టిఫికెట్‌పై సబ్ రిజిస్ట్రార్ సంతకం చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. చివరిగా వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందజేస్తారు. ప్రత్యేక వివాహ సర్టిఫికెట్లకు సైతం ఇదేవిధంగా నమోదు చేసుకోవాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే నేరుగా వివాహ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవచ్చు. లేదా సీఎఫ్‌ఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో చలానా ద్వారా చెల్లించే అవకాశం కూడా ఉంది. జిల్లాలో ఈ నెల 2వ తేదీ నుంచి ఇప్పటి వరకూ ఆన్‌లైన్‌లో 20 వివాహ రిజిస్ట్రేషన్లు జరగడం విశేషం. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సాంకేతిక సమస్యలతో ఆన్‌లైన్ దరఖాస్తుల్లో కొన్ని ఇబ్బందులు వస్తున్నాయని ఉద్యోగులు అంటున్నారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని చెబుతున్నారు.

గత ఏడాది వివాహ రిజిస్ట్రేషన్ల వివరాలు

కాకినాడ	: 1,060
తుని	: 489
సర్పవరం	: 290
పెద్దాపురం	: 109
తాళ్ళరేవు	: 244
పిఠాపురం	: 459
ప్రత్తిపాడు	: 241
జగ్గంపేట	: 158
సామర్లకోట	: 190
మొత్తం	: 3,240



కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో వివాహ రిజిస్ట్రేషన్ చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీరామ్మూర్తి

ఈ విధానం మేలు



ఆన్‌లైన్ విధానం ద్వారా మ్యారేజ్ సర్టిఫికెట్ పొందే అవకాశం ఉంది. మ్యారేజ్ రిజిస్ట్రేషన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంలో ఏవైనా సందేహాలుంటే ఉద్యోగులు నివృత్తి చేస్తారు.

- పి.రామలక్ష్మి పట్నాయక్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్ట్రార్

దేవస్థానం వేలం పాటలు ఖరారు

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో సోమవారం నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలాన్ని నూతన నిబంధనల ప్రకారం ఖరారు చేశారు. వేలంలో పాల్గొనే వ్యక్తులే వేలం పాట సొమ్ము చెల్లింపునకు పూర్తి బాధ్యత వహించేలా నిబంధనలు మారుస్తూ దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ పి.హరి జవహర్‌లాల్ ఆదేశించారు. నాలుగు షాపులకు వేలం నిర్వహించగా మూడు షాపులకు ఖరారు చేశారు. దేవస్థానంలో వ్రత మండపాలు, ఇతర ప్రదేశాల్లో పొలరాయిడ్ ఫొటోలు తీసుకునేందుకు నిర్వహించిన వేలం రెండేళ్ల కాలపరిమితికి నెలకు రూ.4,05,000కు ఖరారైంది. గతంలో ఇది నెలకు రూ.1,75,000 మాత్రమే ఉంది. అలాగే సత్యనికేతన్ ఐదో నంబర్ షాపునకు గతంలో నెలకు అద్దె రూ.25,100 ఉండగా తాజాగా అది రూ.43,500కు ఖరారైంది. సత్యనికేతన్ ఆరో నంబర్ షాపునకు గతంలో నెల అద్దె రూ.14,000 ఉండగా తాజాగా రూ.41,500కు ఖరారైంది. దేవస్థానం ఈఓ సత్యనారాయణమూర్తి, దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులకు లోబడి పాటదారులకు షాపులు అప్పగిస్తామని సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ తెలిపారు.

క్లుప్తంగా

అందాల పోటీల్లో కేశనపల్లి గిత్తకు ప్రథమ స్థానం


ప్రథమ బహుమతి పొందిన పుంగనూరు గిత్తతో అడబాల నాని

మలికిపురం: రాష్ట్ర స్థాయిలో జరిగిన అందాల పోటీలలో మలికిపురం మండలం కేశనపల్లి గ్రామం అడబాల లక్ష్మీనారాయణ (నాని)కి చెందిన పుంగనూరు గిత్త ప్రథమ స్థానం పొందింది. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా పెదతాడేపల్లిలో జరిగిన ఈ పోటీలలో ఈ గిత్తకు రూ.30 వేల బహుమతి లభించింది. మంత్రి కొట్టు సత్యనారాయణ, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు చేతుల మీదుగా లక్ష్మీనారాయణ బహుమతి అందుకున్నారు. దేశీయ గోజాతి సంవర్ధక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

కోనసీమ కుర్రోడి పంచ్‌కొట్టుడు

- బాక్సింగ్‌లో రాణిస్తున్న పృథ్వీరాజు
- రింగ్‌లో 11వ ఏటే ప్రవేశం
- సీఎం కప్ నేషనల్స్‌లో గోల్డ్‌మెడల్ సాధన


విశాఖపట్నంలో నేషనల్ విజేతగా పృథ్వీరాజును ప్రకటిస్తున్న అంపైర్ (ఫైల్)

కొత్తపేట: కోనసీమ ప్రాంతంలో ఓ కుగ్రామం కుందాలపల్లికి చెందిన పృథ్వీరాజు అనే కుర్రోడు బాక్సింగ్‌లో రాణిస్తున్నాడు. ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే బాక్సింగ్ క్రీడపై ఆసక్తి పెంచుకున్న పృథ్వీరాజు ఆ క్రీడలో సాధనచేసి తన 11వ ఏట 6వ తరగతి చదువుతున్నప్పుడే స్కూల్ గేమ్స్ ద్వారా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. అలా ఆ క్రీడలో అంచెలంచెలుగా రాణిస్తూ ఇటీవల నేషనల్స్‌లో తమిళనాడుపై గెలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. పి.గన్నవరం మండలం కుందాలపల్లికి చెందిన చింతా వెంకన్న (కౌలురైతు) – గంగాభవాని (ఆశ వర్కర్) దంపతుల కుమారుడు పృథ్వీరాజు ప్రస్తుతం కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రాథమిక విద్య కుందాలపల్లి, 6 నుంచి 8 వరకూ మామిడికుదురు సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ద్వారా అక్కడ చదవగా, 9, 10 తరగతులు అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్మీడియెట్ కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివాడు.

వివిధ స్థాయిల్లో విన్నర్‌గా.. : 2013లో 6 వ తరగతి చదువుతుండగా పృథ్వీరాజుకు బాక్సింగ్ క్రీడపై ఆసక్తి ఏర్పడింది. కోచ్ బొంతు మధుకుమార్ వద్ద శిక్షణ పొందాడు. అదే సంవత్సరం స్కూల్ గేమ్స్‌లో పాల్గొని విజేతగా నిలిచాడు. 2014, 2015 సంవత్సరాల్లో కూడా అదే గేమ్స్‌లో విన్నర్‌గా బహుమతులు గెలుచుకున్నారు. 2021 వరకూ వివిధ కారణాలతో పోటీలకు దూరంగా ఉన్న పృథ్వీరాజు డిగ్రీ చదువుతూ అధ్యాపకుల ప్రోత్సాహంతో మళ్లీ పోటీల్లో పాల్గొంటున్నాడు. అదే ఏడాది విశాఖపట్నం జిల్లా అంకంపల్లిలో జరిగిన 14వ జాతీయ స్థాయి పోటీల్లో, గత ఏడాది నవంబర్‌లో విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన ఏపీ సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో, డిసెంబర్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్థాయిలో రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఇంటర్ కాలేజియేట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్‌లో పాల్గొని విన్నర్‌గా నిలిచాడు. తాజాగా గత నెల 21న విశాఖపట్నం ఆర్‌కే బీచ్‌లో నిర్వహించిన ఏపీ సీఎం కప్ నేషనల్స్‌లో తమిళనాడుపై విజయం సాధించి గోల్డ్‌మెడల్ దక్కించుకున్నాడు. ప్రస్తుతం విశాఖపట్నంకు చెందిన కోచ్ వాసు వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు.

దేశానికి ఖ్యాతి తేవాలన్నది లక్ష్యం



నేను చదువుతో పాటు ఏదో ఒక క్రీడలో రాణించి పేరు తెచ్చుకోవాలని, తద్వారా మంచి ఉద్యోగం పొందాలని అనుకున్నాను. అందుకు బాక్సింగ్‌ను ఎంచుకున్నాను. అంతర్జాతీయంగా విజేతగా నిలిచి దేశానికి ఖ్యాతి తీసుకురావాలన్నది నా లక్ష్యం. మరింత మందిని బాక్సింగ్ క్రీడాకారులను తయారు చేస్తా.

– చింతా పృథ్వీరాజు, బాక్సింగ్ క్రీడాకారుడు

ప్రోత్సాహం అవసరం



నేషనల్ బాక్సింగ్ విజేతగా నిలిచిన పృథ్వీరాజులో ఇంటర్నేషనల్ స్థాయిలో ఆడాలనే పట్టుదల ఉంది. ఆర్థిక ప్రోత్సాహం లేక తగిన కోచింగ్ తీసుకోవడం లేదు. తగిన ప్రోత్సాహం ఉంటే కోచింగ్ తీసుకుని లక్ష్యాన్ని సాధిస్తాడు.

–కె.కనకరాజు, పీడీ, వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొత్తపేట

నలుగురికి కారుణ్య నియామకాలు


కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబికులకు సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాలులో కలెక్టర్ కృతికా శుక్లా కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. నలుగురికి సీనియారిటీని బట్టి ఖాళీల సంఖ్యను తీసుకుని రోస్టర్ ప్రకారం ట్రెజరీ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ సహాయకులుగా నియమించారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు చిత్తశుద్ధి, అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు.

తుప్పల్లో మృత శిశువు


అన్నదేవరపేటలో తుప్పల్లో శిశువు మృతదేహం

తాళ్లపూడి: తుప్పల్లో నెలలు నిండని పసికందు మృతదేహాన్ని పడేయడం అన్నదేవరపేటలో చర్చనీయాంశమైంది. అక్కడి అరుంధతీ పేటలో వాటర్ ట్యాంక్ సమీపంలో నీళ్లు పట్టుకోవడానికి వచ్చిన మహిళలు సుమారు 6 నెలల మృత పసికందును గుర్తించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో శిశువును చూడటానికి వచ్చారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తాళ్లపూడి ఎస్సై కె.వెంకటరమణ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు. ఏఎస్ఐ దాస్, ఆర్ఐ క్రాంతి రేఖ, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యకుమారి, వీఆర్వో నాగేశ్వరరావు తదితరులు పరిశీలించారు.

రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపిక


రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నిడదవోలు: స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో ఇంటర్ కాలేజియేట్ రోప్ స్కిప్పింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి 50 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో అత్యంత ప్రతిభ కనబరిచిన 12 మందిని ఎంపిక చేశారు. ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపిక కావడంతో వారిని ప్రిన్సిపల్ లెఫ్టినెంట్ డాక్టర్ డి.రుద్ర అభినందించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ పి.బాపిరెడ్డి, సెలక్షన్ కమిటీ సభ్యుడిగా శేఖర్‌రాజు, పర్యవేక్షకుడిగా జి.విక్టర్‌బాబు వ్యవహరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ కేవీఎస్ రత్నకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటలతో మానసిక ఉల్లాసం


బెలూన్లు ఎగురవేసి ఖోఖో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కన్నబాబు, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. స్థానిక జేఎన్‌టీయూ క్రీడా మైదానంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే సౌత్‌జోన్ ఖోఖో టోర్నమెంట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులు ఆహ్లాదకర వాతావరణంలో క్రీడలు ఆడాలన్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆటల్లో ప్రతిభ చూపి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ ఈ పోటీల్లో 1,200 మంది క్రీడాకారులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని టోర్నమెంట్లు జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. క్రీడలకు కాకినాడలో మంచి అనువైన మైదానాలు ఉండటం నగరవాసుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్‌కుమార్, డాక్టర్ జీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల అభివృద్ధికి కృషి


ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ప్రసాదరాజు

రాజానగరం: సహచరుల సహకారంతో మూడు యూనివర్సిటీల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వాటి అభివృద్ధికి కృషి చేస్తానని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. 'నన్నయ' ఇన్‌చార్జి వీసీగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఈసీ హాలులో నిర్వహించిన సమావేశంలో బోధన, బోధనేతర సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. జేఎన్‌టీయూకే వీసీగా ఉన్న తనను జేఎన్‌టీయూ విజయనగరంతో పాటు 'నన్నయ' వర్సిటీకి కూడా ఇన్‌చార్జిగా నియమించినందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంగణంలో అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణ పనుల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, త్వరితగతిన పూర్తి చేసే విధంగా ప్రయత్నిస్తానన్నారు. యూనివర్సిటీ అభివృద్ధిలో అంతా భాగస్వాములు కావాలని, తమ విలువైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఆచార్య ప్రసాదరాజు, అరుణ దంపతులకు ఎన్‌సీసీ విద్యార్థులు గార్డ్ ఆఫ్ ఆనర్ ఇవ్వగా, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది, అనుబంధ కళాశాలల ప్రతినిధులు, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓఎస్‌డీ ఆచార్య ఎస్.టేకి, ఈసీ మెంబర్లు ఆచార్య కేవీఎస్ రమేష్, డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి, డీన్‌లు పి.సురేష్‌వర్మ, వై.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్స్, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌ల అధికారులు, పాల్గొన్నారు.



క్రీడలతో ఉజ్వల భవిత


రిబ్బన్ కట్ చేసి జాతీయ స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి రాజా, దొరబాబు


సభలో మంత్రి, ఎంపీ తదితరులు

- మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- శ్రీప్రకాష్‌లో అట్టహాసంగా టేబుల్ టెన్నిస్ పోటీలు

పెద్దాపురం: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను సోమవారం వారు ప్రారంభించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించిన శ్రీప్రకాష్ టీటీ అకాడమీ నుంచి ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలన్నారు. శ్రీప్రకాష్ పాఠశాల జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి పోటీతత్వాన్ని అలవర్చుకుని ముందడుగు వేయాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, సామర్లకోట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ బందారు వీరబాబు మాట్లాడుతూ క్రీడలకు శ్రీప్రకాష్ యాజమాన్యం ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయమన్నారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రావు చిన్నారావు, కె.మోహన్‌బాబు మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్ క్రీడకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పెట్టింది పేరన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నైపుణ్యాన్ని ప్రదర్శించి విజయం సాధించాలన్నారు. 24 రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది క్రీడాకారులు ఐదు రోజుల పాటు జరిగే టీటీ పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం మంత్రి రాజా, ఎంపీ గీత, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబులు టేబుల్ టెన్నిస్ ఆడి పోటీలను ప్రారంభించారు. రిఫరీలు సూర్యారావు, వేణుగోపాల్, వైఎస్సార్ సీపీ నాయకులు కనపర్తి చీమదొర, బోనాసు గుర్రాజు, యినకొండ వీరవిష్ణుచక్రం, నల్లల గోవిందు, సుందరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

300 కిలోల గంజాయి స్వాధీనం


పట్టుకున్న వ్యాన్, నిందితుడిని చూపుతున్న రావులపాలెం పోలీసులు

రావులపాలెం: ఓ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకుని డ్రైవర్‌ను అరెస్టు చేయడంతో పాటు 300 కిలోల గంజాయి, రూ.2.60 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు రావులపాలెం సీఐ ఎన్.రజనీకుమార్ సోమవారం తెలిపారు. ఆదివారం సాయంత్రం గోపాలపురం ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద జాతీయ రహదారిపై వాహన తనిఖీ చేస్తుండగా రావులపాలెం వైపు నుంచి తణుకు వైపు వ్యాన్‌లో తరలిస్తున్న గంజాయిని గుర్తించామన్నారు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం వలసంపేటకు చెందిన డ్రైవర్ పోతు శివను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. అక్రమ సంపాదనకు ఆశపడి గంజాయిని రవాణా చేస్తున్నట్టు నిందితుడు అంగీకరించాడన్నారు. కేసు నమోదు చేసి అతనిని రిమాండ్ నిమిత్తం కొత్తపేట జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచామన్నారు. గంజాయిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఎస్సై సురేంద్రను, ఇతర కానిస్టేబుల్స్‌ను సీఐ అభినందించారు.

జిల్లా అగ్నికుల యూత్ అధ్యక్షుడిగా వెంకటరాజు



అమలాపురం టౌన్: జిల్లా అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ అధ్యక్షుడిగా అల్లవరం మండలం ఎస్.పల్లిపాలేనికి చెందిన కొపనాతి వెంకటరాజు నియమితులయ్యారు. ఈ నెల 8న విజయవాడలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో జరిగిన సంఘ పోషకుల ఆత్మీయ సమావేశంలో జిల్లా కమిటీని నియమించారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటరాజుతో పాటు గౌరవాధ్యక్షుడిగా ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన బొడ్డు బుజ్జి, జిల్లా కన్వీనర్‌గా బండార్లంకకు చెందిన కొప్పాడి దుర్గారావు నియమితులయ్యారు. ఈ మేరకు వెంకటరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు నియమితులైన ముగ్గురినీ అమలాపురంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి పినిపే విశ్వరూప్, వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం రాత్రి అభినందించారు.

బంగారు ఆభరణాల చోరీ

సీతానగరం: మిర్తిపాడు గ్రామంలోని ఓ ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ జరిగింది. ఆ గ్రామానికి చెందిన కోరాడ వెంకటలక్ష్మి ఈ నెల 5న తన ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్‌లోని తన కుమారుల వద్దకు వెళ్లింది. సోమవారం ఆమె హైదరాబాద్ నుంచి ఇంటికి రాగా తలుపు తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులోని బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని గుర్తించి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. 30 కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితురాలు చెబుతోంది. ఎస్సై కె.శుభశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై విచారణ చేస్తున్నామని ఆయన తెలిపారు.

హత్య కేసులో మరో నిందితుడి అరెస్ట్

మండపేట: స్థానికంగా ఫొటోగ్రాఫర్ హత్య కేసులో మరో నిందితుడిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి మండపేట బైపాస్ రోడ్డులోని లేఅవుట్‌లో స్థానిక తర్వాణీపేటకు చెందిన ఫొటోగ్రాఫర్ కుంజాల సురేష్ (26) హత్యకు గురైన విషయం విదితమే. సురేష్‌ను హత్య చేసేందుకు టీడీపీ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పట్టణానికి చెందిన కోరా గోవిందు, బుంగ సంజయ్‌ల ద్వారా కారు డ్రైవర్ శెట్టి వీర వెంకటేశ్వరరావు, గునుపల్లి నాగసాయి కృష్ణప్రసాద్, మేనుగుల శ్రీనులతో రూ.రెండు లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటికే వెంకటేశ్వరరావు, సాయికృష్ణ ప్రసాద్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, సోమవారం మేనుగుల శ్రీనును కపిలేశ్వరపురంలో అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసులో మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

